# బాధానివారణ ధురీణ

ఆఫీసు వదిలిన తర్వాత, ఏ కాఫీ హోటల్లోనో అరగంట కాలం గడిపి, ప్రాణంలేని కాయితాల మధ్య అంత వరకూ ఇరుక్కుపడ్డ ప్రాణం కాస్త తేరుకున్న తర్వాత, ఆ కాఫీ హోటల్నుంచే సరాసరి కాలవవొడ్డున వున్న 'టౌను హాలు'కు పోయి కాసేపు చతుర్ముఖ పురాణం చెప్పుకొని, ఆ తర్వాత కాసేపు 'చెస్' ఆడుకొని, పరిచయమైన నలుగురితోనూ నాలుగు విషయాలూ మాట్లాడి ఏ తొమ్మిదింటికో, పదింటికో, ఇంటికి చేరుకోవడం నా కలవాటు.

రోజూ ఇంటికి చేరుకొనేసరికి కులపతి నిద్రపోతుండేవాడు. వాడికన్నా పెద్దది కళ్యాణి. వాళ్ళమ్మను మురిపించడముకోసమని వరండాలోవున్న కుర్చీలో కూచుని క్లాసుపుస్తకాలు చదువుతున్నట్టు నటిస్తూ సినిమా పత్రికలు చూస్తుండేది. మా ఆవిడ గడపమీద తల పెట్టుకుని మూగన్నుగా నిద్రపోతూ. "అదేమిటే? అప్పుడే నిద్రపోతున్నావ్? ఇంకా ఇంగ్లీషు వార్తలు వచ్చి, రేడియోఅన్నా మూత పడలేదు" అంటే, "అబ్బే, అదేంలేదండీ; అమ్మాయి పాఠం చదువుతూంటే, వింటూ పడుకున్నాను," అనేది, బద్ధకంగా లేచి కూచుంటూ. ఆ రోజుమాత్రం వాతావరణం అట్లాలేదు.

నేనింకా గేటులోకి రాకుండానే ఎదురు వచ్చి, "అమ్మయ్య! వచ్చారూ? అమ్మణ్ణికి జ్వరం అండీ? నూటనాలుగు పైనే వుంది" అన్నది బెదురుగా అన్నపూర్ణ:

మా ఇల్లు వున్నది వూరికి దూరంగా వున్న సొసైటీలో. రిక్షాలు వుండవు. రాత్రిపూట జనసంచారం వుండదు. పిలిస్తే కనీసం పలకేవారన్నా వుండరు. ఎవరి ఇరుకులు, ఎవరిగొప్పలు వాళ్ళవి.

గుమ్మంలోంచే మళ్ళీ వెనక్కు తిరుగుతూ, "అయితే, ఎవర్నో ఒకర్ని డాక్టర్ని పిల్చుకు వస్తాను," అన్నాను, ఆ అస్వాస్థ్యానికి నాలో నేనే బాధపడ్తూ.

"ఉడుకులాం తెప్పించాను. అక్కాయిని పంపించి సాయంత్రం ఆచార్లగార్ని పిలిపించాను. ఏదో రంగరించి ఇచ్చారు. లోపలికి వచ్చి ముందు అమ్మాయి నోసారి చూడండి" అన్నది అన్నపూర్ణ- 'అంత రాత్రిపూట మళ్ళీ ఏం వెళ్తారు?' అన్న సూచనగా.

లోపలికి వెళ్ళి కల్యాణిని చూశాను. ఒళ్ళు కాలిపోతున్నా, అదుర్దా పడవలసిన అవసరం లేదనిపించింది. ఏదో మామూలు జ్వరం, కొంచెం తీవ్రంగా వచ్చిందని, అంతే! మర్నాటికి ఆచార్లుగారి ఆయుర్వేదం మందువల్ల గానీండి, మా అదృష్టం బావుండి గానీండి, కళ్యాణికి నార్మలుకు వచ్చేసింది. నేను ఆఫీసుకు ధైర్యంగా వెళ్ళగలిగాను. అయినా ఎందుకయినా మంచిదని సాయంత్రం క్లబ్బుకు పోకుండా సిటీ

కొండముది శ్రీరామచంద్రమూర్తి

బస్సెక్కి ఇంటికి వచ్చేస్తుండగా ఆయన బస్సులో కనిపించారు. ఆయనను చూసేసరికి ఆ క్రిందటి సాయంత్రం పడ్డ ఆదుర్దా అంతా జ్ఞాపక మొచ్చింది.

అనేకసార్లు ఆయనను అదే నంబరు బస్సులో చూశాను మంచి ఖరీదుగల 'టై' కట్టుకు పొడుగ్గా బలంగా కనిపించే మధ్యవయస్కుడు. చేతిలో ఓ తోలు సంచీ వుండేది. తీక్షణమైన కళ్ళు, వెడల్పాటి నుదురు, బట్టతల. మాట్లాడినప్పుడల్లా కంఠం కంచులా ఖంగుమనేది.

ఆఫీసులో వున్నా. రోడ్డుమీద నడుస్తున్నా. పదిమందితో మాట్లాడుతున్నా. ఇతరుల హావభావ విశేషాల్ని గమనించి వాళ్ళ మనస్తత్వాలను గమనించే దురలవాటొకటి చిన్నప్పటినుంచీ వుంది నాకు. వాళ్ళవాళ్ళ మాటల్నిబట్టి వాళ్ళు చేస్తున్న ఉద్యోగాన్నీ, వాళ్ళ సంస్కారాల్నీ అంచనా వేయాలని ప్రయత్నించేవాణ్ణి.

ఆయనను చూస్తే ఎందునో నాకు డాక్టరనిపించింది. ఆ నమ్మకం రాను రాను ధృఢమైంది. నలభయ్యేళ్ళున్నాయి నాకు దగ్గర దగ్గర. ఇంతవరకూ నేననుకొన్నది తప్పలేదు. ఇప్పుడు మాత్రం ఎందుకు పొరపాటు పడతానూ? అయన తప్పకుండా డాక్టర్! — సందేహం లేదు.

ఆ సాయంత్రం కళ్యాణికోసమని క్లబ్బుక్కూడా పోకుండా, ఇంటికి సిటీ బస్‌లో ఎక్కి వస్తుండగా ఆయన డాక్టరని స్పష్టంగా నాకు తెల్సింది. నన్నుచూసి నేనే గర్వపడ్డాను. ఆయన ప్రక్కన కూచున్న ఓ ముసలాయన ఆయనతో అంటున్నాడు:

"ఏమండీ డాక్టరుగారూ! ఆ కేసు ఏమైంది? బాధ తగ్గినట్టేనా?" డాక్టర్ నవ్వాడు. గుబురు మీసాలను ప్రక్కకు సర్దుకున్నాడు "ఆఁ! తగ్గ కేమవుతుంది? వాటి తల్లో జెజెమ్మల్లాంటివి లొంగాయి; ఇదో లెక్కా? కానీ వాళ్లు ఇంతకు పూర్వమే నన్ను పిలిచిఉండాల్సింది సుమాండీ! చాలా ఆలస్యం చేశారు!"

"అవునవును." డాక్టర్‌గారి సామర్థ్యం తనకు క్రొత్త కాదన్నట్లుగా తనూ ఆయనతో నూటికి నూరుపాళ్ళూ వొప్పుకుంటున్నట్లుగా ఆ ముసలాయన తలాడించాడు. "ఎంతమంది బాధలో నివారిస్తున్నారు మీ కిదో లెక్కా?"

"ఏదో లెండి! అంతా ఆ భగవంతుడి దయ!" డాక్టరుగారు ఈసారి వినయంగా తలవొంచాడు.

ఆ ముసలాయన అందుకు సుతరామూ ఒప్పుకోలేదు. గంటకొట్టినట్టు అన్నాడు. "అమ్మమ్మ! అట్లా అనకండి డాక్టరుగారూ! ఇదంతా అదృష్టం అని కనిపించని ఆ దేవుడి మీదకు తోసేస్తే నేనొప్పేదిలేదు సుమాండీ! మీరు కష్టపడుతున్నారు? తెలివి తేటలన్నీ ఉపయోగించి మనుష్యులకి వారి బాధ నివారిస్తున్నారు. ఎప్పటికప్పుడు క్రొత్తమందులు కనిపెడుతున్నారు."

డాక్టరుగారు ఈ సారికి వొప్పుకోక తప్పలేదు. "ఏదో లెండి!" అనేశాడు లౌక్యంగా ఆ ముసలాయన సంతృప్తి పడి, ఆ తర్వాత స్టేజీలో దిగిపొయ్యాడు.

ఈ సంభాషణ అనేకవిధాలుగా నాకు అంగీకారమైంది. కారణాలు అనేకం. ఒకటి, మా అమ్మాయికి స్వస్థత పూర్తిగా చిక్కలేదు రెండు, పిల్లల్నీ పెద్దవాళ్ళనీ అందర్నీ సంవత్సరాని కోసారి సమర్థ

దైన డాక్టరుచేత పరీక్ష చేయించి ఒంట్లో వున్న 'డెఫిషియన్సీస్' తగ్గించాలని నాకో ఉబలాటం. మూడు, కొన్నికొన్ని పదార్థాలు తింటే నా ఒంటికి పడకుండా వచ్చినయ్ ఆ పదార్థాలంటే నేను సాధారణంగా వాలిక్కోసుకుంటాను. నా సమస్యల్లా నేను వాటిని తిననూ తినాలి, నాకు జబ్బు చేయకుండానూ వుండాలి. అట్లా చేయగల డాక్టరు కావాలి! ఒకరిద్దరు డాక్టర్లనీ విషయం సంప్రదించి సలహాలు పాటించి నిరాశ పొందాను.

ఈ క్రొత్త డాక్టరు నాపాలిటికి దేవుడ్లా కన్పించాడు. అటువంటాయనకోసమే నిజానికి అంతవరకూ నేవెతుకుతోంది!

"క్షమించండి డాక్టరుగారూ!" ఆయనదగ్గరకు వెళ్ళి, ప్రక్కన కూచుని అతిసౌమ్యంగా అన్నాను. ఆయన ఉలిక్కిపడి నావేపు తిరిగి 'ఎందుకూ?' అన్నాడు సంభ్రమంగా; ఆతర్వాత స్థిమిత పడ్డాడు. ఆయనకళ్ళు కొత్తచేప కనబడిన తృప్తితో తళతళ మెరుస్తున్నాయి.

"నేను కలెక్టరేట్‌లో యూడీసీని. సొసైటీలో మాది ఫలానానంబరు యిల్లు. ఓవిషయంలో నాకు మీ సలహా కావాలి."

"తప్పకుండాను. అంతకన్నా నాకు సంతోషం కల్గించేది మరోటి వుండదు."

ముందు నావిషయం ఆయనతో మాట్లాడి, ఆతర్వాత నాకు సంతృప్తి కల్గితే అమ్మాయిని చూపిద్దా మనుకున్నాను. అనుమానం మనసైపోయింది.

"ఎప్పుడు మిమ్మ కలుసుకోమంటారు?"

"మీ ఇష్టం. ఎప్పుడైనాసరే! రాత్రిపూట అయితే మరీమంచిది. తొమ్మిది దాటింతర్వాతే దివ్యంగా వుంటుంది."

ఆయనకూడా క్లబ్బుపక్షి కాడుకదా — అనుకొన్నాను. అయినా డాక్టర్లు అటువంటి చిన్నచిన్న సరదాలకు దూరంగా వుంటారని నాకో నమ్మకం.

ఇంకొక విధంగాకూడా మనసును సరిపెట్టుకున్నాను. మనదేశంలో డాక్టర్ల కొరత ఎక్కువగావుంది. అయిదువేల మందికి కూడా ఒక్కో డాక్టరు లేడు. ఆ కారణంగా వున్నవాళ్ళందరికీ, సమర్థులైనా కాకపోయినా, 'రోరింగ్ ప్రాక్టీస్' వుంటుంది. హస్తవాసిమంచిదై సమర్థుడే ఐతే ఇహ ఆ డాక్టరుకి వూపిరేసల్పదు. నేను కలిసి పరిచయం చేసుకున్న డాక్టరు కూడా అటువంటివాడే ఐవుండాలి!

"ఐతే తొమ్మిదిన్నరకు కలుద్దామా?"

"ఓ! యస్. తప్పకుండానూ!"

"అయితే మీఅడ్రస్ ఇవ్వండి."

కలమూ, నోటుబుక్కూ బైటకుతీశాను.

"నాఅడ్రసెందుకు? మీఅడ్రసివ్వండి. నేనే వచ్చి తొమ్మిదిన్నరకు మిమ్మల్ని మీ ఇంట్లో కల్సుకుంటాను."

నిజంగా ఇటువంటిడాక్టర్లు సకృత్తుగాగాని వుండరు. "థాంక్యూ డాక్టర్!" అంటూ కృతజ్ఞతతో బరువెక్కిన కంఠముతో జవాబిచ్చాను. నాఅడ్రస్ రాసిచ్చి.

బస్సు కాశీశ్వరరావు మార్కెటు దగ్గర ఒక్క కుదుపుతో ఆగింది. అక్కడ దిగి, కొత్తపేట దాటి ఇంకాపైకి వెళ్ళాలి. నేను దిగి, ఆయనకు నమస్కారం పెట్టి, ఆయనదగ్గర సెలవు తీసికొంటుండగా, ఆయనకూడా ప్రతినమస్కారం చేసి, జేబులోనుండి తన 'విజిటింగ్ కార్డు' తీసి హుందాగా నాకందించాడు.

సంతోషంగా దాన్ని అందుకుని, తృప్తిపడ్డమనసుతో, దానివేపు చూశాను. కార్డుమీద బంగారంలాంటి అక్షరాలు.

"డాక్టర్ యమ్. యన్. సింహం, క్రిమికీటక బాధానివారణ ధురీణ." ★